క్లుప్తంగా

శ్రీ విశ్వనాథుడికి అన్నాభిషేకం


స్వామి వారికి అన్నాభిషేకం

కడప కల్చరల్ : కడప నగరం అక్కాయపల్లిలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం , అనంతరం సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకించారు. ధనుర్మాసం మార్గశిర ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు వివరించారు. పూజలో వాడిన గంధం పసుపు కుంకుమలను భక్తులందరికీ ప్రసాదంగా అందజేశారు. ఈ పూజల్లో స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రీడా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మునీస్మీనా అన్నారు. సోమవారం విద్యాలయంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి జీవితంలో క్రీడల ప్రాముఖ్యతను గురించి వివరించారు. క్రీడల్లో రాణించటం వల్ల జీవితంలో చాలా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం ఆయన క్రీడా వార్షిక దినోత్సవ పోటీలను ప్రారంభించారు. స్పోర్ట్స్ ఇంచార్జి శిరీషా కస్తూరి ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులను అందజేసి అభినందించారు.

'పీస్' విద్యార్థి ప్రతిభ


ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థి ఇబ్రహీం

కడప : తిరుపతిలో జరిగిన ఇంటర్ స్కూల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో భాగంగా 35 కేజీల చాలెంజింగ్ విభాగంలో కడప నగరంలోని తమ పాఠశాల విద్యార్థి విశేష ప్రతిభ కనబరిచాడని పీస్ ఇంటర్నేషనల్ స్కూలు డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ విద్యార్థిని ఆయన ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన షేక్ ఇబ్రహీం (6వ తరగతి) గోల్డ్ మెడల్ తో పాటు 1500 క్యాష్ ప్రైజ్‌ను గెలిపొందాడని, అలాగే త్వరలో బెంగళూరులో జరిగే ప్రిన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో పాల్గొని జిల్లా ఘనతను చాటగలడని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె పెన్నానది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ అవసరాల నిమిత్తం మాత్రమే ఉచిత ఇసుక విధానం అమలు చేసిందన్నారు. అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా కడప నగరానికి ఇసుక తరలిస్తున్న విషయాన్ని స్థానికులు సమాచారం ఇవ్వడంతో మాచుపల్లె, కడప రహదారిలో రెండు వాహనాలను పట్టుకొని సిద్దవటం తహసీల్దార్‌కు అప్పజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ సదస్సు

వల్లూరు: ఊటుకూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని దిగువపల్లె గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా ఊటుకూరు ఏరువాక కేంద్రానికి అనుసంభందించిన విద్యార్థులు ఒంటిమిట్ట మండలంలోని సీ కొత్తపల్లె, మలకటపల్లె, వల్లూరు మండలంలోని దిగువపల్లె గ్రామాలలో 3 నెలల పాటు రైతులతో కలిసి వ్యవసాయం మరియు అనుబంధ రంగాల కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొని అనుభవాన్ని పొందారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా దిగువపల్లెలో వ్యవసాయ ప్రదర్శనతో బాటు రైతు సదస్సును ఏర్పాటు చేశారు. వ్యవసాయ ప్రదర్శనలో విద్యార్థులు నేల కోత, సమీకృత వ్యవసాయ పద్ధతులు, డ్రోన్‌ల వినియోగం, అడవి పందుల నుండి పంటలను కాపాడుట, బిందు, తుంపర సేద్యం మొదలైన అంశాలను వివిధ రకాల మోడల్స్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య కుమార్ వ్యవసాయ పంటల్లో రైతులు ఎదుర్కొనే సమస్యలకు తగిన సూచనలు, సలహాలను అందించారు. పంటల్లో సమగ్ర సస్య రక్షణ చర్యలను గురించి వివరించారు.

కడపలో తొలి క్రైస్తవ కిరణం

క్రిస్మస్ ప్రత్యేకం
- కాంగ్రిగేషనల్ చర్చి
- నగరంలో తొలి చర్చి
- వందల సంవత్సరాల ఘన చరిత్ర


కడపలోని కాంగ్రిగేషనల్ చర్చి

కడప కల్చరల్ : బ్రిటీషు పాలకులు మన దేశంలో ఉన్నప్పుడు కొందరు క్రైస్తవ ధార్మికవేత్తలు ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక సేవలు అందించాలని భావించి దేశంలోని కొన్ని ప్రాంతాలలో నాటి ఉన్నతాధికారుల సహకారంతో చర్చిలను నిర్మింపజేశారు. ఆ క్రమంలో కడప నగరంలో కూడా తొలిసారిగా చర్చిని నిర్మించారు. నగరంలో తొలి చర్చిగా వెలుగొందుతున్న దీన్ని నిర్మించి వందల సంవత్సరాలైంది. పాత రిమ్స్ సెంటర్‌లో కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి పేరిట ఈ చర్చి నేటికీ వేలాది మందికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేస్తూ విశిష్ట ప్రార్థనా మందిరంగా విలసిల్లుతోంది. వారం రోజుల్లో క్రిస్మస్ పండుగ నిర్వహించుకోనున్న తరుణంలో ఈ చర్చి గురించి చారిత్రక విశేషాలు.

నిర్మాణ చరిత్ర

క్రీస్తుపై భక్తిని పెంచేందుకు ఇంగ్లాండ్‌లో 1794లో 'ది లండన్ మిషన్ సొసైటీ'ని స్థాపించారు. ఏసు క్రీస్తు బోధనలను ప్రపంచమంతటా చాటే పనిలో భాగంగా 1810లో సొసైటీ రెవరెండ్ జాన్ హాండ్స్‌ను మన దేశంలోని కర్ణాటక రాష్ట్రంలోగల శ్రీ రంగపటాన్నికి పంపారు. ఆ సమయంలోనే దక్షిణ భారతదేశంలో సొసైటీ ప్రధాన కార్యాలయాన్ని ఆ రాష్ట్రంలోని బళ్లారిలో ఏర్పాటు చేశారు. రెవరెండ్ హాండ్స్ బళ్లారి కేంద్రంగా క్రీస్తు బోధనల ప్రచారం కోసం తరుచూ కడపకు వస్తుండేవారు. అప్పట్లో సైనిక కేంద్రంగా ఉండిన కడపలో కూడా సొసైటీ శాఖను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఇందుకు సమర్థులైన వ్యక్తి కోసం గాలింపు మొదలు పెట్టారు. చిత్తూరు జిల్లాలో విశేషంగా క్రీస్తు సేవలను అందిస్తున్న విలియం హ్యావెల్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆయన లండన్ మిషన్ సొసైటీ ఆదేశాల మేరకు 1790లో కడపజిల్లాకు వచ్చారు. పీడబ్ల్యుడీ శాఖలో ప్రభుత్వ సర్వేయర్‌గా పనిచేస్తుండిన హ్యావెల్‌కు తెలుగు, సంస్కృతాలలో మంచి ప్రావీణ్యం ఉండేది. దీంతో ఆయన మన ప్రాంతాలలో క్రైస్తవ సువార్తను ప్రతిభావంతంగా ప్రచారం చేసేవారు. ముఖ్యంగా తెలుగుభాషలో ఆయనకు మంచి పట్టు ఉండేది. ఆయన ప్రత్యేకంగా తెలుగు వ్యాకరణం పేరిట 1834లో బళ్లారిలో ఒక పుస్తకాన్ని ముద్రింపజేశారు. అలాగే క్రీస్తు కీర్తనల పేరిట మరో పుస్తకాన్ని కూడా రూపొందించారు. నాటి కడప కలెక్టర్ లెకస్ ఈ పుస్తకాల ముద్రణకు విరాళం అందజేశారు.

భవనాల నిర్మాణం

రెవరెండ్ హ్యావెల్ కృషిని గమనించిన నాటి చిత్తూరుజిల్లా జడ్జి వాట్సాన్ ఉద్యోగ రీత్యా కడపకు వచ్చినపుడు హ్యావెల్ నివాసం కోసం ప్రత్యేకంగా ఓ భవనాన్ని నిర్మింపజేశారు. (ఆ భవనమే మొన్నటి వరకు మున్సిపల్ కార్యాలయంగా ఉండేది ప్రస్తుతం కొత్త భవనానికి మారాక పాత భవనాన్ని తొలగించారు) ఆ భవనంలో ప్రతిరోజు సాయంత్రం పలువురు స్థానిక ప్రజలకు ఆయన క్రీస్తు సువార్తను వినిపించేవారు. క్రమంగా ఆ బోధనలను వినేందుకు వచ్చే వారి సంఖ్య పెరగడంతో ప్రార్థనల కోసం ప్రత్యేకంగా మరో విశాలమైన భవనం అవసరమైంది. తన నివాసానికి సమీపంలోని స్థలాన్ని సేకరించి కొత్త ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేయాలని హ్యావెల్ నిర్ణయించారు. అందుకోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా స్థానికులతో కలిసి చర్చి నిర్మాణానికి ధనాన్ని సేకరించడం మొదలు పెట్టారు. కేవలం కడపలోనే కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా విరాళాలు సేకరించి భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. 1824 నాటికి అన్ని వసతులతో కూడిన చర్చి భవనం అందుబాటులోకి వచ్చింది. ఇది కడప నగరంలో తొలి చర్చిగా చరిత్రలో చోటు సంపాదించింది.

బైబిల్ పాఠశాల

చర్చి ఆవరణ చాలా విశాలంగా, ప్రశాంతతకు నిలయంగా ఉంది. ఈ ప్రాంగణంలో ప్రస్తుతం మరి కొన్ని భవనాలు ఏర్పడ్డాయి. అందులో ఒకటి సమావేశాలు, చిన్న ఉత్సవాలు నిర్వహిస్తారు. చర్చి ప్రారంభమైన తొలినాళ్లలో నిర్మించిన భవనం కూడా ఈ ప్రాంగణంలో ఉంది. అందులో ప్రస్తుతం బాలల కోసం బైబిల్ పాఠశాల నిర్వహిస్తున్నారు. చర్చి ప్రక్కనే పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా సమావేశ మందిరాన్ని నిర్మించారు. ఇందులో ఆధ్యాత్మిక సమావేశాలు, వివాహాలు నిర్వహించుకునేందుకు వీలుగా అన్ని వసతులు కల్పించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణా కాలం ఉంటుందని, శిక్షణలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల మృతిచెందిన కార్మికుడు సందీప్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టీపీపీ జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సందీప్ కుటుంబానికి రూ.కోటి ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటివరకు విశాఖపట్నం అనకాపల్లి విజయనగరం తదితర ప్రాంతాలలో కర్మాగారాలలో చనిపోయిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం గతంలో ప్రభుత్వాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అలాగే బాధితుడి కుటుంబానికి ఉద్యోగ భృతి కల్పించాలని కోరారు.

• ఆధ్యాత్మిక పరిమళం

ప్రారంభమైన ధనుర్మాస పూజలు


విశేష అలంకారంలో గోదాదేవి సమేత శ్రీవారు


పాశురాల గానం చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : జిల్లాలోని వైష్ణవాలయాలలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఈ మాసం ప్రారంభం సందర్భంగా ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు స్నానం ఆచరించి పూజాద్రవ్యాలతో ఆలయాలకు వచ్చారు. వైష్ణవ ఆలయాలలో భక్తులు బుధవారం నుంచి తిరుప్పావై పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. సూర్యోదయానికి ముందే సామూహికంగా విష్ణు సహస్ర నామా పారాయణాలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు ప్రత్యేకంగా పగలు పత్తు కార్యక్రమంలో భాగంగా గోదాదేవి తిరుప్పావై పాశురాల పారాయణం చేశారు. నివేదన, నక్షత్ర కుంభ హారతులు, చతుర్వేద స్వస్తి, భజనలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాశురాల పారాయణం చేశారు. తిరుమల తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేశారు. అలాగే ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం, గడ్డి బజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం తదితర వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యూజీడీ పైపులైన్ మరమ్మతులు చేపట్టండి

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


యూజీడీ పంప్‌హౌస్‌ను పరిశీలించి వస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ నిర్వహణ, శుభ్రత, ఆరోగ్యకరమైన పరిసరాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కడప నుంచి వెళ్లే యూజీడీ పైపులైన్ వివరాలు తెలుసుకొని, పంపింగ్ హౌస్‌ను పరిశీలించారు. పాడైన పైపులైన్లను మరమ్మతులు చేయాలన్నారు. మరుగుదొడ్ల వల్ల ఉత్పత్తి అయ్యే నీటి నాణ్యతను మెరుగుపరచడం, నగర శుభ్రతను కాపాడటం కీలకమని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌టీపీలను నాణ్యతాలోపాలు లేకుండా నిర్మించాలన్నారు. ఎస్‌టీపీలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని నిర్ధారించే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తాగునీటి సరఫరా, నిర్వహణపై పబ్లిక్ విభాగం అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

తైక్వాండో శిక్షణతో మానసిక ధైర్యం

వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

వైవీయూ : తైక్వాండో ఆత్మ విశ్వాసం పెంచి ధైర్యంగా ముందుకెళ్లగలిగేలా తయారు చేస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. 'ఫిట్ ఇండియా' వారోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినిలకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టల్ల చీఫ్ వార్డన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాకుండా క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. ఎన్ని అననుకూల పరిస్థితులు వచ్చిన మానసికంగా దృఢంగా ఉంటూ ముందుకెళ్లాలన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుందని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గంటన్నర పాటూ నిపుణులు శిక్షణ ఇస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తైక్వాండో శిక్షకులు మాస్టర్ నాగూర్ బాబు మాట్లాడుతూ ఆత్మరక్షణ తైక్వాండో అనేది ఆత్మరక్షణ నైపుణ్యాలను నేర్పే ఒక యుద్ధ కళ అని వివరించారు. కార్యక్రమలో వసతి గృహ సంక్షేమ అధికారి డా. సునీత, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో చిన్మయామిషన్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి భగవద్గీత పఠన పోటీల్లో స్థానిక బాలవికాస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతులను అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ గంగయ్య సోమవారం తెలిపారు. పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని 59 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు డి గ్రూపు నుంచి 5 వ తరగతి విద్యార్థి సుభాష్ ప్రతిమన్, 10 తరగతి విద్యార్థి టి.ప్రదీప్ కుమార్‌లు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తరఫున కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య, శ్రీ లక్ష్మిలు అభినందిస్తూ వారికి ఒక్కొక్కరికి రూ. 2000 నగదు అందించి అభినందించారు.

సేవ్ పబ్లిక్ సెక్టార్ సదస్సు జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కడపలో ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఇక్కడే కొనసాగించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం 5గంటలకు కడప బాలాజీనగర్‌లోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించనున్న సేవ్ పబ్లిక్ సదస్సును జయప్రదం చేయాలని సెక్టార్ కమిటి నాయకులు రఘు నాథరెడ్డి, లక్ష్మీ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఇండస్ట్రియల్ రిటైర్డ్ జెడీ గోపాల్, లీగల్ సెల్ సభ్యులు జాన మద్ది విజయబాస్కర్ విచ్చేయనున్నట్లు తెలిపారు. సదస్సుకు జిల్లాలోని బ్యాంకింగ్ రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు, బ్యాంకు ఖాతాదారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న న్యాయవాదులు, న్యాయమూర్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి మీడియేషన్ కన్సల్టేషన్ ప్రాజెక్టు కమిటీ ఆదేశాల మేరకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, కడప ఇన్‌చార్జి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.ప్రవీణ్‌కుమార్ న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల పాటు శిక్షణ అనే అంశంపై మాట్లాడారు. మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అని, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అన్నారు. ఇది ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందని తెలిపారు. విభాగం 89 సీపీసీ ఆర్డర్-1 రూల్ 10 ప్రత్యామ్నాయ వివాదం, స్పష్టత, మధ్యవర్తిత్వ నియమాలు-2017, సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం, రాజీనామా, ప్రాజెక్టు కమిటీ నిబంధనలు-2015, మధ్యవర్తిత్వం చట్టం-2023 సెక్షన్ 89 ఆర్డర్స్ ఎక్స్ఎల్ఏ, 1సీ, 1డి మరియు 32ఏ యొక్క సివిల్ ప్రొడెక్షన్ కోడ్ 1908 మధ్యవర్తిత్వం, రాజీ చట్టం-1996 స్థాపనలు చేయడానికి నిబంధనలను చేస్తుంది. మీడియేషన్ యాక్టు 2023 సెక్షన్-6, 320 సీఆర్‌పీసీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కర్ణాటక రీసోర్స్ పర్సన్ ట్రైనర్ మిస్ బీనా దేవరాజు, తమిళనాడు రీసోర్స్ పర్సన్ ట్రైనర్ డాక్టర్ ఎస్.పద్మ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన


ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీరామ్, డ్రైవర్ల కమిటీ కార్యదర్శి ఎస్. కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ కార్మికులు, అడిషనల్ కార్మికులకు మూడు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ వేతనాలు తక్షణమే అకౌంట్లో జమ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాబోవు రోజుల్లో క్రిస్మస్, జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలు ఉన్నాయని, పండుగల పూట కార్మిక కుటుంబాలను పస్తులు పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి ప్రకాష్, పర్మినెంట్ కార్మికుల నాయకులు టి.మస్తాన్, ఎం ఆశబాబు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం


గోవింద రవికుమార్‌ను సన్మానిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

కడప కార్పొరేషన్ : ఏపీ ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై న కడప సబ్ ట్రెజరీ ఆఫీసర్ గోవింద రవికుమార్‌ను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డా. శివానాయక్ మాట్లాడుతూ రవికుమార్ ఆధ్వర్యంలో ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగన్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, అర్జున్ నాయక్, బాబు నాయక్, క్రిష్ణ నాయక్, జయరాం నాయక్, కిరణ్ నాయక్, మణికంఠ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ఎంఆర్‌టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి


మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రకృతిసిద్ధంగా తలెత్తే విపత్తులను తగిన భద్రతతో సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎంఆర్‌టీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఎన్‌పీటీఐ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌పీటీఐ డైరెక్టర్ కె. ముత్తుకుమార్, రిటైర్డ్ ఈఈ వెంకట రమణలతో పాటు ఈఈ రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ వారు 'కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ' శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ శిక్షణ కొనసాగనుందన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది శ్రద్ధగా శిక్షణను తీసుకొని విధి నిర్వహణలో ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ క్రిష్ణదేవ పాల్గొన్నారు.

బీమా నమోదు గడువు పెంపు

కమలాపురం: పంటల బీమా నమోదు గడువు ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు మండల ఏఓ సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ 2024-25లో సాగు చేసిన పంటలకు సంబంధించిన బీమా ప్రీమియం ఈ నెల 15 వరకు చెల్లించాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే గడువు పూర్తి కావడంతో ఇంకా బీమా ప్రీమియం చెల్లించని రైతుల కోసం 30వ తేదీ వరకు గడువును పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

వల్లూరు: మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం తోల్లగంగనపల్లె, బుధవారం అంబవరం, 19న గోటూరు, 20 న వల్లూరు, 26 న ఆదినిమ్మాయపల్లె, 27న తప్పెట్లలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామాపురం : మండల పరిధిలోని చిట్లూరు కస్పా శివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని టీడీపీ మండల నాయకులు గాలివీటి సురేంద్రనాథ రెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో కిడ్నీ, ఎముకలు, కీళ్ల సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, దీర్ఘకాల వ్యాధులకు సంబంధించిన రోగులు తమ రిపోర్టులను తీసుకురావాలని తెలియజేశారు.

• క్రీస్తు బోధనలు ఆచరణీయం



సెమీక్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు, ప్రసంగిస్తున్న సతీష్‌కుమార్

కడప కల్చరల్ : అందరినీ ప్రేమించాలి, శాంతి మార్గంలో నడవాలి, సేవాభావంతో మెలగాలి అన్న క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని కల్వరీ టెంపుల్ అధినేత డాక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి కడప మునిసిపల్ గ్రౌండ్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు కొందరికే కాదు అందరికీ రక్షకుడని అన్నారు. లోకాన్ని రక్షించేందుకు ఏసుక్రీస్తు భూమిమీదకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించారు. క్రీస్తుజననం నాటకం ప్రదర్శించారు. అనంతరం కేక్ కట్ చేశారు.